ప్రజాశక్తి

సోమవారం 16 డిసెంబర్ 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా





కమ్యూనిస్టుల ముద్ర చెరగనిది

● సిపిఎం కృష్ణాజిల్లా 25వ మహాసభలో కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి

● చల్లపల్లిలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ ● ఆకట్టుకున్న ప్రభలు, కళారూపాయలు



చల్లపల్లిలో నిర్వహించిన భారీ బహిరంగ సభ; సభలో మాట్లాడుతున్న ఎం.హరిబాబు



అమరస్తూపాన్ని ఆవిష్కరించిన సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

దివి ప్రాంతంలో కమ్యూనిస్టుల ముద్ర చెరగనిదని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి అన్నారు. సిపిఎం కృష్ణాజిల్లా 25వ మహాసభ ప్రారంభం సందర్భంగా ఆదివారం చల్లపల్లిలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించారు. చల్లపల్లి ఎటిఎం సెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో పుణ్యవతి ప్రసంగిస్తూ చల్లపల్లి నారాయణరావు, గుంటూరు బాపనయ్య సాగించిన జమీందారీ వ్యతిరేక రైతాంగ పోరాటంలో 42 మంది యోధులు తమ ప్రాణాలను త్యాగం చేశారని, వీరిలో మహిళా రైతు బావిరెడ్డి వియమ్మ కూడా ఉన్నారని గుర్తుచేశారు. ఈ పోరాట ఫలితంగా దివి ప్రాంతంలో (మిగతా 2లో)

వరదలపై దొంగ బిల్లులు !

● రూ.1.50 కోట్లు బొక్కేందుకు అధికారి యత్నం ?

● తెరవెనుక ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్ల ప్రమేయం

● అవినీతికి అడ్డాగా విఎంసి

ప్రజాశక్తి -విజయవాడ : నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో అవినీతి ఏరులై పారుతోంది. అవినీతి అక్రమాలకు కేంద్రంగా మారింది. రానురాను కాంట్రాక్టర్లు, దళారులు, ప్రధానంగా ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల జోక్యం పెరిగిపోవడంతో అవినీతి అక్రమాలకు ఆస్కారం ఏర్పడుతోంది. ఈనేపథ్యంలోనే విఎంసి ప్రజారోగ్య విభాగం అధికారులు అక్రమ మార్గంలో కోట్ల రూపాయలు జేబులో వేసుకొనే ప్రయత్నం చేశారు. వివరాల్లోకి వెళితే... ఈ ఏడాది సెప్టెంబర్లో సంభవించిన బుడమేరు, కృష్ణానది వరదలకు సుమారు 1.50 లక్షల మందికిపైగా సర్వం కోల్పోయారు. ఆ వరదలకు ప్రాణ నష్టంతోపాటు వందల కోట్ల ఆస్తి నష్టం జరిగింది. నేటికీ ఆ కుటుంబాలు కోలుకోలేదు. తమను ఆదుకోవాలని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. సాయం అందక వరద బాధితుల అవస్థలు ఇలా (మిగతా 2లో)

నేడు "సాంస్కృతిక వైవిధ్యం - దేశ సమైక్యత'పై స్మారకోపన్యాసం

హాజరుకానున్న బి.వి.రాఘవులు

ప్రజాశక్తి - విజయవాడ : మార్క్సిస్ట్ సిద్ధాంతకర్త, స్వాతంత్ర్య సమరయోధులు మాకినేని బసవపున్నయ్య 112వ జయంతి సందర్భంగా సోమవారం సాయంత్రం 6 గంటలకు "సాంస్కృతిక వైవిధ్యం – దేశ సమైక్యత' అన్న అంశంపై సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్టు చైర్మన్ బి.వి.రాఘవులు స్మారకోపన్యాసం చేస్తారు. స్థానిక గవర్నరుపేట రాఘవయ్యపార్క్ సమీపంలోని ఎంబి విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమానికి ఎంబివికె ట్రస్టు చైర్మన్ పి.మధు అధ్యక్షత వహిస్తారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎంబివికె కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ కోరారు.

అందరికీ ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం

- సొంత స్థలంలో ఇల్లు కావాలంటే దరఖాస్తు చేసుకోవచ్చు
- మార్చి నుండి సచివాలయాల్లో పేర్లు నమోదు
- నిధుల లభ్యత ఆధారంగా గృహ నిర్మాణాలు
- ప్రజాశక్తితో గృహ నిర్మాణ శాఖ ఎన్‌టిఆర్ జిల్లా ఇన్చార్జి పీడీ కపూర్





ప్రజాశక్తి - విజయవాడ : గృహ నిర్మాణ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎన్‌టిఆర్ జిల్లా గృహ నిర్మాణశాఖ ఇన్చార్జి ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) ఇ.ఇ.జి.కపూర్ చెప్పారు. ఇల్లు లేని ప్రతి పేద వానికి స్థలం కేటాయిస్తూ... అందరికీ ఇళ్లు పథకం ద్వారా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఇళ్ల నిర్మాణానికి నిధుల కేటాయింపు జరుగుతూ దశల వారీగా బిల్లులు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలను పూర్తి చేయడమే లక్ష్యంగా పనులు ముందుకు సాగుతున్నాయని వివరించారు. జిల్లాలో గృహ నిర్మాణ పథకం, మంజూరైన గృహాలు, వాటి నిర్మాణం, నిధుల కేటాయింపు తదితర అంశాలపై కపూర్ ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న : జిల్లాకు మంజూరైన గృహాలెన్ని ?

గృహ నిర్మాణ పథకం కింద జిల్లావ్యాప్తంగా 82,223 గృహాలు మంజూరయ్యాయి. 2021లో అప్పటి ప్రభుత్వం నుంచి నేటి వరకు వీటి నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఈ పథకం కింద ఇంకా పనులు ప్రారంభం కాని ఇళ్లు 690 ఉన్నాయి. పునాది దశలో 34,334 గృహాలు, బేస్‌మెంట్ లెవల్ 20 వేలు, రూఫ్ లెవల్‌లో 3,075 గృహాలున్నాయి. స్లాబ్ వేసిన గృహాలు 4,690, పూర్తయిన గృహాలు 19,434 ఉన్నాయి.

ప్రశ్న : గృహ నిర్మాణ పనులకు ఇప్పటి వరకు ఏ మేరకు చెల్లింపులు జరిగాయి ?

గృహ నిర్మాణాలకు రూ.624 కోట్ల మేర చెల్లింపులు జరిగాయి. బిల్లులను పెండింగ్‌లో ఉంచడంలేదు. ఎప్పటికప్పుడు చెల్లింపులు జరుగుతున్నాయి.

ప్రశ్న : సిఆర్‌డిఎ పరిధిలో గత ప్రభుత్వ కాలంలో ఈ పథకం కింద ఇచ్చిన, కోర్టు కేసుల్లో ఉండి, ప్రస్తుత ప్రభుత్వంలో రద్దు చేసిన ఇళ్ల స్థలాలెన్ని?

విజయవాడ నగరంలోని మూడు నియోజకవర్గాల పరిధిలో 23,658 మందికి 337 లే అవుట్లలో సెంటు చొప్పున పంపిణీ చేసిన స్థలాలకు గత ప్రభుత్వం పట్టాలిచ్చింది. ప్రస్తుతం అవి రద్దయ్యాయి.

ప్రశ్న : 2019 నాటికి ముందున్న టిడిపి ప్రభుత్వ హయాంలో గ్రామీణ పేదలకు గృహ నిర్మాణ పథకం కింద మంజూరైన గృహాలెన్ని ?

ఈ పథకం కింద అప్పట్లో 6,543 గృహాలు మంజూరయ్యాయి. వీటిల్లో 2,400 గృహాలు పునాదుల దశలో ఉండగా, 284 గృహాలు స్లాబ్ దశలో ఉన్నాయి. మరో 1232 గృహాల నిర్మాణం పూర్తి కాగా, 167 రూఫ్‌లెవల్లో, మరో 263 గృహాలు బెస్‌మట్టం లెవల్లో ఉన్నాయి. 2,959 గృహాల నిర్మాణం నేటికీ ప్రారంభమే కాలేదు.

ప్రశ్న : ప్రస్తుత ప్రభుత్వంలో కొత్తగా ప్రవేశపెడుతున్న గృహ నిర్మాణ పథకం ఎప్పటి నుంచి అమలుకావచ్చు?

అందరికీ ఇళ్ల పథకం కింద 60:40 నిష్పత్తిలో ఖర్చును భరించేవిధంగా వచ్చే మార్చి తర్వాత గృహ నిర్మాణ పథకం ప్రారంభకానుంది. సొంత స్థలం కలిగి ఉండి, ఇల్లు కావాలనుకున్న అర్హులైన ప్రజలు ప్రతి సచివాలయం పరిధిలో సంబంధిత రేషన్‌కార్డు, ఆధార్ కార్డు ఇస్తే వారి పేర్లను నమోదు చేసుకుంటారు. యూనిట్ విలువ రూ.2.50 లక్షలు. కాగా, దీనిలో లక్ష రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం, రూ.1.50 లక్షలు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తాయి. అర్హులందరికీ ఇంటి సదుపాయం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోంది. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ఈ పథకంపైనే ప్రస్తుతం సర్వే జరుగుతోంది. సత్యనారాయణపురంలో ఉన్న జిల్లా కార్యాలయాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలోకి మార్పు చేశాము. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలి.



చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు : ఎంపి

ప్రజాశక్తి-విజయవాడ : ఆంధ్ర రాష్ట్రం అవతరణ కోసం ఆత్మ బలిదానం చేసిన త్యాగధనుడు, భాషాప్రయుక్త రాష్ట్రానికి ఆద్యుడు అమరజీవి పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో రాష్ట్ర సర్వతో ముఖాభివద్ధితోపాటు స్వర్ణాంధ్ర ఏ2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్య సాధనకు ప్రభుత్వం అకుంఠిత దీక్షతో ముందుకు సాగుతోందని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం లో అమరజీవి పొట్టి శ్రీరాములు గారి ఆత్మార్పణం–భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావం కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు అచ్చెన్ననాయుడు, కొలుసుపార్థసారధి, నారాయణ, ఎమ్మెల్యేలు విప్ బొండా ఉమామహేశ్వరరావు, శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), యార్లగడ్డ వెంకట్రావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ లతో పాటు కలిసి ఎంపి కేశినేని శివనాథ్ స్వాగతం పలికారు.

ఎఐఎస్ఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - విజయవాడ : రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 3580 కోట్ల రూపాయల ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్‌ను విడుదల చేయాలని, జీవో నెంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం విజయవాడ లెనిన్ సెంటర్ వద్ద ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జి.వలరాజు, బందెల నాసర్ జీ, మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, నెలలు గడుస్తున్నా, విద్యా దీవెన, వసతి దీవెన లను విడుదల చేయలేదన్నారు. పెండింగ్లో ఉన్న బకాయిలను చెల్లించడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి తదితరులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములుకు సిపి నివాళులు

ప్రజాశక్తి - విజయవాడ : అమరజీవి పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి సందర్భంగా ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, పోలీస్ అధికారులు ఆయన చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిపి మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర సాధనకు 58 రోజులు నిరవధిక దీక్ష చేసి తన ప్రాణాలను అర్పించి అమరులయ్యారని గుర్తుచేశారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణకు, భారతదేశంలో బాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు, స్వాతంత్ర్య సాధనకు ఆత్మార్పణం చేశారని తెలిపారు. ఆయన ఆశయాలను, సేవలను స్ఫూర్తిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.



మొదటిపేజీ తరువాయి

కమ్యూనిస్టుల ముద్ర చెరగనిది

10 వేల మంది కుటుంబాలకు వ్యవసాయ భూములు, 7,500 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ జరిగాయన్నారు. సిపిఎం పోరాట ఫలితంగా ఉమ్మడి రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ అమల్లోకి వచ్చిందన్నారు. సబ్‌ప్లాన్‌కు అనుగుణంగా దళిత, గిరిజనలకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. 200 దళితవాడల్లో శ్మశానవాటికలు లేకపోవడం శోచనీయమన్నారు. దేశంలో కుల వివక్ష పెరిగిపోతోందని, దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో అదానీ కుంభకోణంపై సిఎం చంద్రబాబు, మాజీ సిఎం జగన్ నోరువిప్పడం లేదన్నారు.

ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలి

ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు

ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ ధాన్యానికి మద్దతు ధర అందక రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తేమశాతం పేరుతో బస్తాకు రూ.300 వరకు రైతులు, కౌలు రైతుల నుంచి మిల్లర్లు దోచుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కేరళ ప్రభుత్వం అక్కడ రైతులకు ధాన్యానికి కనీస మద్దతు ధరకు బోనస్ కలిపి ఇస్తోందని తెలిపారు. కేరళ తీసుకువచ్చిన రుణ విముక్తి చట్టాన్ని దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ తీసుకురావాలని కోరారు. రాష్ట్రంలో రైతులు, కౌలు రైతుల ఆత్మహత్యల నివారణకు కేరళతరహా చట్టం తీసుకురావాలన్నారు.

అమరుల స్ఫూర్తితో ఎన్నో పోరాటాలు నిర్వహించాం

సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ అమరవీరుల స్ఫూర్తితో జిల్లాలో గత మూడేళ్లలో అనేక పోరాటాలను నిర్వహించామని తెలిపారు. ధాన్యానికి మద్దతు ధర కోసం, పంట నష్టపరిహారం కోసం, కుల వివక్షకు వ్యతిరేకంగా, స్కీం వర్కర్లకు మద్దతుగా పోరాటాలు సాగించినట్లు చెప్పారు. సిపిఎం చల్లపల్లి మండల కార్యదర్శి యద్దనపూడి మధు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు సురేంద్రనాథ్ బెనర్జీ, సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు పరుచూరి జనార్ధన్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కళ్లం వెంకటేశ్వరరావు, టివి.లక్ష్మణస్వామి, కె.శివనాగేంద్రం, జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణరావు, పంచకర్ల రంగారావు, బూర సుబ్రహ్మణ్యం, ఆర్‌సిపి.రెడ్డి, పోలినాయుడు, ధనశ్రీ, మాజేటి శివ శ్రీనివాసరావు, మూర్తి, బేతా శ్రీనివాస్, సిహెచ్ రాజేష్, గోపాలరావు, మోపిదేవి, ఘంటసాల, కోడూరు మండలాల కార్యదర్శులు బండి ఆదిశేషు, మేడంకి వెంకటేశ్వరరావు, పోలాబత్తిన మోహనరావు తదితరులు పాల్గొన్నారు. సిపిఎం మండల నాయకులు కరీముల్లా వక్తలను వేదికపైకి ఆహ్వానించారు.

వరదలపై దొంగ బిల్లులు

ఉండగా, నగర పాలక సంస్థ ప్రజారోగ్య విభాగానికి (పారిశుధ్యం) చెందిన ఓ ముఖ్య అధికారి వరదలను సైతం ఆదాయ వనరుగా మార్చుకుని వివిధ రూపాల్లో కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నించారు. విఎంసి అనుమతి లేకుండానే వరద ప్రభావిత ప్రాంతమైన అజిత్‌సింగ్‌నగర్‌తోపాటు నగరంలోని పలు డివిజన్లలో పారిశుధ్య పనుల కోసం రోజువారీ ఒప్పందం కింద 3 వేల మందికిపైగా కార్మికులను ఒప్పంద పద్ధతిలో విధుల్లోకి తీసుకున్నట్లు తెలిసింది. అంతేగాక ఆ కార్మికులకు సుమారు రూ.1.50 కోట్ల వరకు వేతన బిల్లులు చెల్లించాలంటూ దొంగ బిల్లులు తయారు చేసి, గత నెలలో ప్రజారోగ్య విభాగం ముఖ్య అధికారికి పంపినట్లు తెలిసింది. అయితే బిల్లుల పరిశీలనలో అసలు ఒప్పంద కార్మికుల నియామకానికి విఎంసి అనుమతి లేనట్లు తేలింది. దీంతో ఆ బిల్లులను తిప్పి పంపారు. ఇంతటితో ఆగకుండా తిరిగి ఆ బిల్లులు ఆమోదం పొందేలా చూడాంటూ గత నెలాఖరులో ప్రజారోగ్య విభాగంలోని పర్యవేక్షణాధికారి, సెక్షన్ గుమస్తాలకు మళ్లీ పంపినట్లు తెలిసింది. దొంగ బిల్లులను మరోసారి పెడితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించినట్లు తెలిసింది. దీంతో పర్యవేక్షణాధికారి, గుమస్తాలపై ఆ అధికారి వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. ఈ విషయం కాస్తా విఎంసి కమిషనర్ వరకు వెళ్లడంతో ఆయన తక్షణమే దొంగ బిల్లులను ఆపాలని ఆదేశించినట్లు తెలిసింది. ఇటువంటి దొంగ బిల్లుల వ్యవహారం మొత్తాన్ని పరిశీలించాలని కమిషనర్ సంబంధిత సెక్షన్‌లోని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ దొంగబిల్లుల వ్యవహారంలో విఎంసిలోని ప్రజాప్రతినిధుల హస్తంతోపాటు కాంట్రాక్టర్ల ప్రమేయం కూడా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇలా ప్రజారోగ్య విభాగాన్ని అవినీతికి అడ్డాగా మార్చుకొని పలువురు ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు, అధికారులు విఎంసి ఖజానాకు గండి కొడుతున్న వైనంపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పొట్టి శ్రీరాములు, పటేల్‌కు నివాళులు

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద శ్రీ పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్ర పటాల వద్ద నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డిచంద్రశేఖర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావం కోసం శ్రీ పొట్టి శ్రీరాములు చేసిన కషి వెలకట్టలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో విఎంసి మేనేజర్ ఏయుబి శర్మ, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



నీటి సంఘాల అధ్యక్షులకు సత్కారం



అవనిగడ్డలో సన్మానిస్తున్న మండలి బుద్ధప్రసాద్



గుడివాడలో సభ్యులను అభినందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అవనిగడ్డ : నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించే బాధ్యత ఆయా గ్రామాల సాగునీటి సంఘాల దేనని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సూచించారు. అవనిగడ్డలో ఆదివారం క్షేత్రంలో నియోజకవర్గంలోని నూతన నీటి సంఘాల అధ్యక్షులు ఉపాధ్యక్షులకు నియోజకవర్గ యువ నాయకులు మండల వెంకటరావు ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్, నియోజకవర్గ టిడిపి పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావులు అధ్యక్ష ఉపాధ్యక్షులను ఘనంగా సత్కరించార.ు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇరిగేషన్ వ్యవస్థకు పునరుత్తేజం కల్పించేందుకు సాగునీటి సంఘాల ప్రతినిధు లు గణనీయమైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, 2 లక్ష్మణరావు, పర్చూరు సుభాష్, చంద్రబోస్, గుడివాడ శేషుబాబు, బాదర్ల లోలాక్షనాయుడు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడివాడ** : స్థానిక రాజేంద్ర నగర్‌లోని ఎమ్మెల్యే వెనిగండ్ల గృహంలో నీటి సంఘాలు ఎన్నికల్లో విజయం సాధించిన గుడివాడ నియోజకవర్గ పరిధిలోని నీటి సంఘాల అధ్యక్షులు, కమిటీ సభ్యులను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావతో కలసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల అవసరాలను గుర్తించి సమస్యలను పరిష్కరించేలా ముందుకు వెళదామన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించడం ప్రభుత్వం పనితీరుకు నిదర్శనమన్నారు. గుడివాడ రూరల్ మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, నందివాడ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, టిడిపి నాయకులు, నీటి సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అవనిగడ్డలో బాలిక అదృశ్యం



ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని లంకమ్మ మాన్య వద్ద అదృశ్యమైన ఆవుల దివ్య(3) కేసు మిస్టరీగా మారింది. ఆ పాప శనివారం నుండి కనిపించడం లేదని బాలిక తల్లిదండ్రులు గోపి కొండలమ్మ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు బాలిక మిస్సింగ్ పై గాలింపు చర్యలు చేపట్టారు. నాగాయలంక వైపు వెళ్లే దక్షిణం కాలువ వారు నివసించే ప్రాంతం నుండి వెళ్లడంతో ప్రమాదవశాత్తు కాలువలో పడి ఉండవచ్చునా అనే కోణం నుండి కూడా గాలింపు చేపట్టారు. లేక ఎవరైనా ఎత్తుకుపోయి ఉండవచ్చునా అని కూడా పరిశీలిస్తున్నారు. అయితే ఇప్పటివరకు ఆ బాలిక ఆచూకీ తెలియకపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలకు గురై కన్నీరు మున్నీరుగా పిలపిస్తున్నారు.



మంత్రి కొల్లుకు పరామర్శ

ప్రజాశక్తి-నాగాయలంక : రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లురవీంద్ర సోదరుడు కొల్లు వెంకట రమణ గుండెపోటుతో మం ´ణించగా ఆదివారం మచిలీ పట్నంలో మంత్రిని మత్స్యకార సంఘాల ప్రతినిధులు పరామర్శించారు. ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజ నేయులు, జిల్లా మత్స్యకారుల సహకార సంఘం మాజీ అధ్యక్షుడు లంకే నారాయణ ప్రసాద్, డైరెక్టర్ కర్రి కష్ణమూర్తి నాయకులు లంకే శ్రీనివాస ప్రసాద్, బొడ్డు రామమోహనరావులు పరామర్శించి మతుడు వెంకట రమణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



దుస్తులు, నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-చల్లపల్లి : నిరుపేదల జీవితాల్లో క్రిస్మస్ వెలుగు నింపాలని ఐవీఎం ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్ అన్నారు. ఆదివారం చల్లపల్లి మండలం పురిటిగడ్డలో ఐవీఎం కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. చల్లపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన 102 మంది వితంతువులు, పేదలకు ఐవీఎం సురేష్ ఆధ్వర్యంలో రూ.లక్షా 30 వేలు వ్యయంతో నూతన వస్త్రాలు, నిత్యావసర సరుకులు సహాయంగా అందచేశారు.



దుస్తులు, నిత్యావసరాలు అందిస్తున్న దృశ్యం

కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వేములపల్లి రోజా, విజయ పాల్గొన్నారు.

కర్రసాములో పతకాలు అభినందనీయం

- ఎంఎల్ఎ మండలి బుద్ధప్రసాద్



విజేతలను అభినందిస్తున్న మండలి బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ : ప్రాచీన ఆత్మ రక్షణ కళ అయిన కర్ర సాముకు పునరుత్తేజం కల్పించడం హర్షణీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ప్రశంసించారు. జాతీయ ఽస్థాయి కర్ర సాము పోటీలలో 42 బంగారు పతకాలు సాధించిన ఈశ్వర్ అకాడమీ విద్యార్థులను బుద్ధ ప్రసాద్ అభినందించారు.ఈ నెల 13, 14 తేదీలలో నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి ఇండోర్ స్టేడియంలో మొదటి నేషనల్ కర్రసాము ఛాంపియన్షిప్ పోటీలలో ఈశ్వర అకాడమీ విద్యార్థులు 42 బంగారు పతకాలు సాధించారు. ఈ పోటీలలో వివిధ రాష్ట్రాల నుండి 1200 మంది విద్యార్థిని విద్యార్థులు వివిధ కేటగిరిలో పోటీపడ్డారు. కానీ అవనిగడ్డ గాంధీ క్షేత్రంలోని ఈశ్వర్ డాన్స్ మార్షల్ అకాడమీలో శిక్షణ పొందిన 22 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొని వివిధ కేటగిరిలలో ఫైట్, కట్ ఆఫ్ విభాగాలలో 42 గోల్డ్ మెడల్స్ 9 సిల్వర్ మెడల్స్ ఐదు బ్రాంచ్ మెడల్స్ సాధించినట్లు అకాడమీ నిర్వాహకులు కర్ర సాము సెక్రెటరీ విశ్వ కోచ్ టిఆర్ఎస్ అరవింద్ తెలిపారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు

ప్రజాశక్తి-గన్నవరం : కొందరు గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి.11 గంటల సమయంలో సుమారు 80 సంవత్సరాలు పైబడిన వృద్ధురాలిని గన్నవరం ఆల్ఫా హెూటల్‌కు సమీపంలో జాతీయ రహదారి పక్కన వదిలేసి వెళ్లారు. స్థానికుల సహాయంతో గన్నవరం సీఐ బివి శివ ప్రసాద్ సమాచారం అందుకున్నారు. వెంటనే స్పందించి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని భయంకరమైన చలిలో వణుకుతూ ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిన వద్ధురాలికి ఆసుపత్రిలో ప్రధమ చికిత్స చేయించారు. అనంతరం స్థానిక బికేఆర్ ఆశ్రమం నిర్వాహకులతో సంప్రదించి వద్ధురాలిని అక్కడ చేర్చారు. జన్మనిచ్చి, పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను వద్ధాప్యంలో అనా థులుగా వదిలేయడం చాలా బాధాకరమని, ఇది ఒక హదయ విదారక సంఘటన అని గన్నవరం సీఐ ప్రసాద్ అన్నారు. వద్ధురాలు వివరాలు సేకరించి వారి బంధువులకు కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. ఆమెను సురక్షితంగా కుటుంబ సభ్యులకి అప్పగిస్తామన్నారు.

19న విద్యుత్ అదాలత్ అవగాహన సదస్సు

ప్రజాశక్తి-ఉయ్యూరు : కన్స్యూమర్స్ గ్రీవెన్సస్ రెడ్రెస్సల్ ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 19న విద్యుత్ అదాలత్ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిగ్యూటివ్ ఇంజనీర్ డి.కష్ణనా యక్ తెలిపారు. ఉయ్యూరు డివిజన్ పరిధి అవనిగడ్డ రెవెన్యూ కార్యాలయం ప్రాంగణంలో ఉదయం 10 గంటల 30 నిముషాల నుండి మధ్యాహ్నం ఒంటిగంట 30 నిముషాల వరకు జరిగే ఈసదస్సులో సీజి ఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్, ఫోరం సభ్యులు, విద్యుత్ అధికారులు పాల్గొని వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు.

రామకృష్ణకు పలువురు నివాళి

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కావూరి రామకృష్ణ సేవలు పలువురికి ఆదర్శమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం మోపిదేవిలో రామకష్ణ వర్ధంతి కార్యక్రమానికి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై ఘనంగా నివాళు లర్పించారు. తెలుగు దేశం మండల పార్టీ అధ్యక్షులు నడకుదురు జనార్ధన్ రావు, మాజీ సిడిసి చైర్మన్ రావి నాగేశ్వరరావు తదితరుల పర్యవేక్షణలో రామకష్ణ చిత్రపటానికి బుద్ధప్రసాద్, నియోజకవర్గ టీడీపీ అబ్జర్వర్ కనపర్తి శ్రీనివాసరావు, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, నాయకులు, ప్రజా ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

టెక్నాలజీలో డ్రోన్లకు పెద్దపీట : సిపి

ప్రజాశక్తి-విజయవాడ : విజయవాడ పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖం ´బాబు ఆధ్వర్యంలో పోలీసు కమిషనరేట్ పరిధిలో ఉన్న అన్నీ పోలీసు స్టేషన్లకు డ్రోన్ లను అందించే కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సంధర్భంగా రాజశేఖరబాబు మాట్లాడుతూ పోలిసింగ్ లో లైవ్ డ్రోన్ ట్రాఫిక్ సర్వేలన్స్, క్రైమ్ సీన్ సర్వేలన్స్, అల్లర్లు చేసేవారిని చెదర గొట్టడానికి డ్రోన్ ద్వారా టియర్ గ్యాస్ ఉపయోగించవచ్చునని అన్నారు. ఈ క్రమంలో ఇప్పటికే 100 మందికి మహిళా పోలీసులకు డ్రోన్ పైలైటింగ్ పై శిక్షణ ఇచ్చామన్నారు. యంపి కేసినేని శివనాధ్ (చిన్ని) మాట్లాడుతూ నగరాన్ని సి.పి. డ్రోన్ నగరం గా చేశారన్నారు. తమ వంతుగా కూడా పోలీసులకు సహాయం చేస్తామన్నారు. నగర కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ నగరపాలక సంస్థ తరుపునా కూడా డ్రోన్ కెమెరాలను ఉపయోగించి దోమల నివారణకు మందు చల్లడం, రోడ్లపై చెత్త తీస్తున్నారా, లేదా అని గమనిస్తామన్నారు. అనంతరం పోలీసు కమిషనర్, యంపి చేతుల మీదుగా ప్రతి పోలీసు స్టేషన్ కు ఒక డ్రోన్ చొప్పున 28 పోలీసు స్టేషన్ లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎల్.ఏ. గద్దె రామ్మోహన్, సెంట్రల్ ఏం.ఎల్.ఏ. బోండా ఉమా మహేశ్వర రావు, మైలవరం ఏం.ఎల్.ఏ వసంత కష్ణ ప్రసాద్, డిసిపి.లు గౌతమి షాలి, తిరుమలేశ్వరరెడ్డి, కె.ఉమామహేశ్వర రాజు, ఏ.బి.టి.ఎస్. ఉదయారాణి, కష్ణ మూర్తి నాయుడు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సిపి రాజశేఖరబాబు, ఎంపి కేశినేని శివనాథ్, ఎంఎల్ఎలు, అధికారులు

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపే వారిపై గుడ్లవల్లేరు ఎస్సై ఎన్ వివి సత్యనారాయణ చలానాలు విధించారు. మండల కేంద్రమైన గుడ్లవల్లేరు ప్రధాన సెంటర్లో రహదారిపై నిబంధనలకు వ్యతిరేకంగా ప్రయాణిస్తున్న 20 మంది వాహన చోదకులపై చలనాలు ఆదివారం విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు ప్రతి వాహనదారులు పాటించాలని తెలిపారు. హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సి, ఇన్సూరెన్స్ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ఇద్దరి కంటే ఎక్కువ మంది మోటార్ బైకుల పై ప్రయాణించరాదని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది ఉన్నారు.



వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులు

సమాజ మార్పు కోరేలా సాహిత్యం ఉండాలి

ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు



పుస్తకావిష్కరణలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-తిరువూరు: సమాజ మార్పుకు దోహదపడేలా కవిత్వం, సాహిత్యం ఉండాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. స్థానిక సత్య బి.ఇడి కళాశాలలో తిరువూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు ఈడే భరత కుమారి స్వయంగా రాసిన భారతీయం సరళ పద్యాలు పుస్తకాలను లక్ష్మణరావు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మార్పుకు ఆయా రచయితలు రాసిన పుస్తకాలు ఎంతో ప్రేరణ ఇచ్చాయని గుర్తు చేశారు. స్పార్ట కస్ పుస్తకం ప్రపంచంలో జరిగే అన్యాయాన్ని వివరించడమే కాకుం డా బానిసత్వ విముక్తి కోసం ఎలా పోరాడాలో నేర్పింది అన్నారు. వర్గ దోపిడి ఎలా జరుగుతుం దో, దాని నుండి విముక్తి పొందేందుకు ఏం చేయా లో ఒక దిశ నిర్దేశాన్ని కారల్ మార్క్స్ కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టో గ్రంథంలో వివరించారని చెప్పారు. ప్రపంచంలో బైబిల్ తర్వాత ఎక్కువ సార్లు ప్రచు రించిన పుస్తకం కమ్యూనిస్టు మ్యానిఫెస్టోనని లక్ష్మణరావు గుర్తు చేశారు. బ్రిటిష్ వాడి బానిస సంకెల నుండి ఈ దేశానికి స్వాతంత్రం ఎలా తీసుకురావాలో జాతీయ ఉద్యమ నాయకులకు అనేక పుస్తకాలు మార్గాన్ని చూపాయని కొని యాడారు సాహిత్యానికి, కవిత్వానికి సమాజా నికి ఒక ప్రయోజనం ఉండేలా చూడాలని రచ యితలకు ఆయన విజ్ఞప్తి చేశారు. మన చుట్టూ అనేక సమస్యలు ఉన్నాయని వాడితో ప్రజలు ఎంతో సతమతమవుతున్నారని అటువంటి వాటిపై సాహిత్యం, కవిత్వం రూపంలో పుస్తకా లు తీసుకొస్తే ఎంతో మంచిది అన్నారు. భరతకు మారి ఆ దిశగా కృషి చేయాలని ఆయన సూచిం చారు. తెలుగు భాషా సమితి అధ్యక్షులు తోట ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ పుస్తక ఆవిష్కరణ సభలో ప్రసిద్ధ విపుల, చతుర పుస్తకాల పూర్వ సంపాదకులు కంతేటి చంద్ర ప్రతాప్, విద్యాశాఖ అధికారి శ్యాంసుందరరావు తదితరులు పాల్గొన్నారు.




జెవివి వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-తిరువూరు: జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో తిరువూరు నాగార్జున ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన బిపి, షుగర్, ఫిట్స్ రోగుల రెగ్యులర్ వైద్య శిబి రానికి విశేష స్పందన లభించింది. తిరువూరు, మైలవరం నియోజకవర్గాల నుండే కాకుండా ఖమ్మం జిల్లా నుండి కూడా 950 మంది రోగులు హాజరయ్యారు. ఈసందర్భంగా వైద్యులు మాట్లా డుతూ బిపి, షుగర్ కేవలం మందుల వాడకం తోనే నియంత్రణలో ఉండవని, సరైన ఆహార నియమాలు పాటించాలని, ఉప్పు, పంచదారకు దూరంగా ఉండాలని, ఒక్క పూట తప్పనిసరిగా తణ ధాన్యాలను తీసుకోవాలన్నారు. వీటితోపా టు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని వైద్యులు రోగులకు సూచించారు. ఈకార్యక్రమంలో వైద్యులు సత్య తేజ, రవీంద్ర, లక్ష్మణరా వు, శివాజీ, శ్రీవాహిని ఇంజనీరింగ్ కళాశాల ఎన్ ఎస్ ఎస్ విభాగం విద్యార్థులు, జనవిజ్ఞాన వేదిక సభ్యులు పాల్గొన్నారు.

వైసిపి ఎంఎల్‌ఎలు రాజీనామా చేయాలి : బుద్దా

ప్రజాశక్తి-వన్‌టౌన్: అసెంబ్లీకి వెళ్లని 11 మంది వైసిపి ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యేలకు అసెంబ్లీ అంటే ఒక దేవాలయమని, ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులుగా ఆయా నియోజకవర్గాల సమస్యలను ప్రస్తావించాలని, కానీ 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలు మాత్రం అసెంబ్లీకి రాకుండా ఆ ప్రజలనే అవమానిస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీకి రాకుండా ఆ 11 మందికి ప్రతినెలా రూ.1.75 లక్షలు వారి అకౌంట్లోకి పడుతున్నాయన్నారు. అసెంబ్లీకి వెళ్లని వారికి ఎమ్మెల్యేలుగా కొనసాగే అర్హత లేదని, వెంటనే రాజీనామా చేయాలన్నారు. అడ్రస్ లేకుండా పోయిన కొడాలి నాని, వల్లభనేని వంశీల ఆచూకి తెలియ చేస్తే రూ.1116 బహుమానం ఇస్తామని ప్రకటించారు. జగన్ విధానాలు, పోకడలు నచ్చక అనేక మంది వైసీపీని వీడి బయటకు వస్తున్నారని, వైసీపీ త్వరలో పూర్తిగా ఖాళీ అయిపోవడం ఖాయమని విమర్శించారు.



ఎస్‌విఆర్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-వీరులపాడు: వీరులపాడు మండలం జయంతి గ్రామంలో ఎస్వీఆర్ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం అపూర్వంగా నిర్వహించారు. 1982 సంవత్సరంలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు గ్రామ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఒక చోట కలవడంతో ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఉద్యోగాలు వ్యాపారాలు రీత్యా వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వారు చిన్ననాటి మిత్రులను చూసి భావోద్వేగానికి గురయ్యారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని సెల్ఫీలు, ఫోటోలు దిగారు. ఆనాడు తరగతి గదుల్లో చేసిన అల్లరి, చిలిపి పనులను గుర్తుకు తెచ్చుకొని కులాసాగా గడిపారు. అనంతరం నృత్య ప్రదర్శన చేశారు. ఆనాటి కాలంలో విద్యా బుద్ధులను నేర్పిన ఉపాధ్యాయులకు ప్రతి విద్యార్థి పాదాభివందనం చేసి వారిని ఘనంగా సత్కరించారు. ఆనాటి ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులు సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు కుంకులకుంట్ల మల్లయ్య, కొనతం సుబ్బారావు, మలిశెట్టి రోశయ్య, ఇప్పల లక్ష్మారెడ్డి, బొజ్జ మల్లికార్జునరావు, తాడి బోయిన స్వరాజ్యలక్ష్మి, పూర్వ విద్యార్థులు ఇప్పల నాగిరెడ్డి, బొంతు శ్రీనివాస్ రెడ్డి, మెట్టల కోటిరెడ్డి, గువ్వల సత్యనారాయణ, పసుపులేటి పుల్లారావు, చిదిరాల భరత్ రెడ్డి, శివారెడ్డి, పలువురు పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

ఐకాస్ హెరిటేజ్ కలెక్షన్ ప్రారంభం



ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: వివాహాది, శుభ కార్యాలకు ,అత్యాధునిక కలెక్షన్స్ అందించేందుకుగాను ఐకాస్ హెరిటేజ్ కలెక్షన్, స్థిర డైమండ్స్ ప్రారంభించినట్లు సంస్థ నిర్వాహకురాలు రాధిక మన్నె తెలిపారు. నగరంలోని మున్సిపల్ ఎంప్లాయీస్ కాలనీ ఏ ప్లస్ కన్వెన్షన్ ఎదుట ఆదివారం ఉదయం ప్రారంభించారు. అనంతరం రాధిక మన్నె మాట్లాడుతూ మహిళల కోసం ప్రత్యేకంగా అత్యాధునిక వస్త్ర కలెక్షన్ అందించేందుకు హెరిటేజ్ కలెక్షన్స్ నగరంలోని తొలిసారిగా తాము ప్రారంభించామని తెలిపారు. అన్ని రకాలైన ఫాన్సీ చీరలు, డ్రెస్, బెనారస్ చీరలు కూడా ఉంటాయని తెలిపారు. అందరికీ అందుబాటు ధరలలో ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం వివాహాల సందర్భంగా ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక హెరిటేజ్ వస్త్రాలను అందిస్తున్నామని తెలిపారు. వస్త్రాలతో పాటు మహిళలకు డైమండ్ ఆభరణాలను అందించాలనే ఉద్దేశ్యంతో స్థిర డైమండ్స్ ప్రారంభించామని తెలిపారు. అన్ని ఆభరణాలు ఆర్డర్ పై కూడా ఇవ్వనున్నమని తెలిపారు. చెవి దుద్దులు, ఉంగరాలు, హారలు, గొలుసులు, నెక్లెస్, ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీడీప్, కాంచన, రాగ వీణ పాల్గొన్నారు.



ఆర్థిక సాయం

ప్రజాశక్తి-వన్‌టౌన్: స్థానిక 52వ డివిజన్ బ్రాహ్మణ వీధిలో ఇటీవల గుండెపోటుతో మరణించిన నాగినేటి ఉదయశ్రీ (45) కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం అందించారు. పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ (సుజన చౌదరి) ఆదేశాలతో ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది కూటమి నాయకులతో కలిసి ఆదివారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. నిరుపేద అయిన నాగినేటి ఉదయశ్రీ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేయాలని టిడిపి కార్పొరేటర్ ఉమ్మడి చంటి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారి కుమారుడికి ఆర్థిక సాయం అందించారు.

గోనె సంచుల గోడౌన్‌లో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని సాయిబాబా గుడి సమీపంలో తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల గోనెసంచుల గోడౌన్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గోడౌన్ లోని సంచులు, కుట్టు మిషన్లు పూర్తిగా దగ్ధం అయ్యాయి. విషయం తెలుసుకున్న జగ్గయ్యపేట అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలం వద్దకు వచ్చి మంటలను ఆర్పారు. సుమారు రూ.5 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితులు వాపోతున్నారు.

దుర్గగుడి మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష



ప్రజాశక్తి-వన్‌టౌన్: భవిష్యత్తు అవసరాలను దష్టిలో ఉంచుకొని ఇంద్రకీలాద్రి ఆలయ అభివద్ధి పనులను చేపట్టాలని ఎమ్మెల్యే సుజనా చౌదరి సంబంధిత అధికారులకు సూచించారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానాన్ని అభివద్ధి చేసేందుకు అవసరమైన మార్పులు చేసి యుద్ధ ప్రాతిపదికన అభివద్ధి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సుజనా చౌదరి నేతత్వంలో తాడిగడపలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటికే రెండుసార్లు చర్చించిన సుజనా మరో సారి మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష నిర్వహించి సలహాలు, సూచనలను అందించారు. భవిష్యత్తులో ఎదురయ్యే భక్తుల అవసరాలను పరిగణలోకి తీసుకొని మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జనవరి నాటికి మరింత మెరుగ్గా ప్లాన్‌ను సిద్ధం చేయాలని ఎమ్మెల్యే సుజనా ఆదేశించారు. కార్యక్రమంలో దుర్గగుడి ఈఈ వైకుంఠరావు, సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ బి పాండు రంగారావు, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ శ్రీనివాసరావు, సుజనా ఫౌండేషన్ ప్రతినిధి బోరా శ్రీనివాస్, ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్మెస్ బేగ్ పాల్గొన్నారు.

స్వరరాగ సుధామధురం రామమూర్తి గానం



ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి నెలవారి కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక దుర్గాపురం సుందర్ నగర్‌లోని శ్రీ సుబ్రహ్మణ్య మహతి కళాపీఠంలో జరిగిన రామమూర్తి గాత్ర సంగీత కచేరి ఆద్యంతం శ్రోతలను సంగీత రస జగత్తులో విహరింప చేసింది. చక్కని మనోధర్మంతో రాగం పాడటంలో విన్యాస స్వర కల్పన వేయటంలో తనదైన ప్రతిభను కనపరుచుకుంటూ స్వరరాగసుధను పంచారు. అట తాళ వర్ణం, బేగడ రాగంలో వల్లభ నాయకశ్య, పూర్వి కళ్యాణి లో దేవదేవ జగదీశ్వర, దేవమనోహరిలో ఎవరికై అవతారమెత్తితివి, సారంగలో అరుణాచలనాథం, తోడి రాగంలో రాగం తానం పల్లవి తదితర అంశాలను హద్యంగా గానం చేసి ప్రజ్ఞను చాటుకున్నారు. వీరికి వయోలిన్‌తో పెరవలి నందకుమార్, మదంగంతో కె.సద్గురు చరణ్ లు ప్రతిభాన్వితంగా సహకరిస్తూ రామమూర్తి గానానికి నిండుదనాన్ని చేకూర్చి వారి అనుభవాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సమితి ప్రధాన కార్యదర్శి సి వి రావు కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ విచ్చేసి విద్వాంసులను అభినందించారు.



ఎరుపెక్కిన చల్లపల్లి

- సిపిఎం కృష్ణాజిల్లా 25వ మహాసభ ప్రారంభం
- అమర స్తూపం నుంచి ఎటిఎం సెంటర్ వరకు భారీ ర్యాలీ
- ఆకట్టుకున్న ప్రభలు, కళాకారుల డప్పు, తీన్‌మార్ వాయిద్యాలు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

సిపిఎం కృష్ణాజిల్లా 25వ మహాసభ ఆదివారం చల్లపల్లిలో ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైంది. జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా మహాసభకు తరలివచ్చారు. ఈ సందర్భంగా జరిగిన భారీ ప్రదర్శన పట్టణ వాసులను ఆకట్టుకుంది. తొలుత ఆధునీకరించిన అమర స్తూపాన్ని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి ఆవిష్కరించారు. సిపిఎం పతాకాన్ని పార్టీ మండల కార్యదర్శి యద్దనపూడి మధు ఆవిష్కరించారు. అనంతరం అమరస్తూపం నుంచి పడమట, బస్టాండ్ సెంటర్, మెయిన్ సెంటర్ మీదుగా మచిలీపట్నం రోడ్డులోని ఎటిఎం సెంటర్ వరకు కిలోమీటరున్నరకుపైగా భారీ ప్రదర్శన నిర్వహించారు. 25వ మహాసభకు సూచికగా రెడ్ షర్టు, ఎర్ర చీరలు ధరించిన 25 మంది భారీ జెండాలతో ప్రదర్శనలో ముందు భాగాన నడిచారు. ప్రదర్శన అగ్రభాగాన ఎస్.పుణ్యవతింతోపాటు సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, యద్దనపూడి మధు తదితరులు బ్యానర్‌ను చేతపట్టుకుని నడిచారు. చొక్కాలకు సిపిఎం బ్యాడ్జీలు పెట్టుకుని, మెడలో ఎర్ర కండువాలు, చేతిలో ఎర్ర జెండాలు ధరించి ప్రదర్శనలో పాల్గొన్నారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్, ఆటోలపై సిపిఎం అగ్రనేతలు సీతారాం ఏచూరి, చల్లపల్లి నారాయణరావు, పుచ్చలపల్లి సుందరయ్య, గుంటూరు బాపనయ్య తదితరులతోపాటు నాదెళ్ల వెంకట కృష్ణయ్య, ఓలేటి వెంకటేశ్వరరావు, బోలెం భాస్కరరావు, మోహనరావు తదితరుల చిత్రపటాలు, పార్టీ జెండాల కూడిన ప్రభలతో చల్లపల్లి మండలం రామానగరం, నడకుదురు పంచాయతీ శివారు నాదెళ్లవారిపాలెం, మోపిదేవి మండలం నాగాయతిప్ప, ఉత్తర చిరువోలులంక గ్రామాల నుండి వచ్చిన అభిమానులు ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రదర్శనకు ముందు భాగాన ప్రభలు సాగాయి. తీన్మార్ వాయిద్యాలు, డప్పు బృందాలు విన్యాసాలతో ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది. సెకితో విద్యుత్ కొనుగోలు ఒప్పందంపై ఉయ్యూరుకు చెందిన సిపిఎం సభ్యుడు ప్రదర్శించిన ప్లకార్డు ఆలోచింప చేసింది. ఎటిఎం సెంటర్ వద్ద బహిరంగ సభ వేదికపై ప్రజానాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు అబ్బురపరిచాయి.

నేడు, రేపు ప్రతినిధుల సభలు

చల్లపల్లిలోని మురాల రాజేష్ నగర్ (చంద్రరాజేశ్వరరావు వికాస కేంద్రం)లో సోమ, మంగళవారాల్లో సిపిఎం జిల్లా ప్రతినిధుల సభ జరగనుంది. గత మూడేళ్లకాలంలో సిపిఎం తీసుకున్న కర్తవ్యాలను ప్రతినిధుల సభలో సమీక్షించి భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యకలాపాలను మహాసభలో నిర్దేశించనున్నారు. నూతన కమిటీని ఎన్నుకుంటారు.


అదాని ఒప్పందంపై రైతు ప్రదర్శిస్తున్న ప్లకార్డు


ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం




పాటలు పాడుతున్న కళాకారులు


ప్రదర్శనగా వస్తున్న దృశ్యం


వై.నరసింహారావు


కళ్లం వెంకటేశ్వరరావు


శీలం నారాయణరావు


యద్దనపూడి మధు


సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు





నృత్యాలు ప్రదర్శిస్తున్న కళాకారులు

17న గన్నవరంలో జాబ్ మేళా

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డిఆర్‌డి ఎ - సీడాప్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, గన్నవరం సంయుక్త అద్వర్యంలో, జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకుగాను ఈ నెల.17. మంగళవారం గన్నవరం లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి. విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి డాక్టర్ పి. నరేష్ కుమార్, గన్నవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.పద్మావతి సంయుక్తంగా తెలిపారు. ఈ జాబ్‌మేళాలో, ఫ్రింగిల్ ఐటీ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్, యూనివర్సల్ ప్రింట్ సిస్టమ్స్, టాటా క్యాపిటల్, రమా క్లాత్ స్టోర్స్ వంటి ప్రముఖ కంపెనీల వారు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కంపెనీ లలో గల ఉద్యోగాలకు 10వ తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ మరియు పిజి పూర్తిచేసిన 18 నుండి 30 సంవత్సరాల లోపు వారు అర్హులని, ఎంపిక అయిన వారికి నెలకు సుమారు రూ.12,వేల నుండి రూ.30 వేల వరకు వారి పని అనుభవాన్ని బట్టి వేతనం ఉంటుం దన్నారు. మరిన్ని వివరాలకు 94940 05725 నంబర్ను సంప్రదించాలని తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కలెక్టరేట్ సమావేశ హాలులో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక- మీకోసం కార్యక్రమం జరుగుతుందని, అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించుకోవచ్చునన్నారు.

కొండలమ్మ ఆలయానికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో మార్గశిర పౌర్ణమి సందర్భంగా యాత్రికులు అమ్మవారిని దర్శించుకున్నారు. సుమారు 20వేల మంది యాత్రికులు అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, మొక్కుబడులు నేర్చుకున్నారు. పౌర్ణమి సందర్భంగా చండీ హెూమం ను అర్చకులు శివ సంతోష్ ఆధ్వర్యంలో చండీ హెూమం నిర్వహించారు. ఈ చండీ హెూమమునకు ఈవో ఆకుల కొండలరావు పర్యవేక్షించారు. ప్రతి నెల పౌర్ణమి రోజున చండీ హెూమం నిర్వహిస్తామని, చండీ హెూమంలో పాల్గొను యాత్రికులు రూ.516/లు మాత్రమే రుసుము వసూలు చేస్తున్నట్లు ఈవో తెలిపినారు. జనవరి 13వ తేదీ సోమవారం పుష్య మాసము పౌర్ణమి రోజున చండీ హెూమం జరుగుతుందని తెలిపారు. ఆలయం దగ్గర ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు కలగకుండా గుడ్లవల్లేరు ఎస్సై ఎన్ వివి సత్యనారాయణ సిబ్బంది తగు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.





పూర్వ విద్యార్థుల సందడి

జి.కొండూరు : జి.కొండూరు గ్రామంలోని శాగం శివరామి రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990-91 విద్యాసం వత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఒక పండుగ వాతావరణం సంతరించుకుంది. గ్రామ శివారు లోని పాత శివసాయి హెూటల్ ఎదురుగా ఓ మామిడి తోటలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఎవరికి వారు వారి జీవితంలో సాధించిన విజయాలు, ఎదురైన సమస్యలు గురించి, తమ పిల్లల విద్యా భ్యాసం, ఉద్యోగాలు తదితర అంశాలపై ఒకరికొకరు చర్చించుకోవడంతో పాటు వారి అనుభవాలు పంచుకున్నారు. వారు చదవిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిన్ననాటి మధురానుభూతిని గుర్తు చేసుకుంటూ సందడి చేశారు.. అనంతరం మామిడి తోటలోని వేదిక వద్దకు చేరుకున్నారు. ఆట పాటలు, విందు వినోదాలతో రోజంతా సరదాగా గడిపారు. యాంకర్ చరిత్ర పూర్వ విద్యార్థులతో డాన్సులు చేయించారు. రకరకాల ఆటలు, పాటలు, మహిళల అందాల పోటీలు పెట్టి వారిలో ఉత్సాహాన్ని నింపారు. పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు.

రసాయన శాస్త్రంపై ముగిసిన వర్క్‌షాపు

ప్రజాశక్తి-ఉయ్యూరు: అడుసుమిల్లి గోపాలకృష్ణయ్య చెరుకు రైతుల డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న రసాయన శాస్త్ర వర్క్‌షాపు ఆదివారంతో ముగిసింది. ఈ వర్క్‌షాపులో మాలిక్యూలర్ ఆర్బిటాల్స్, వైబ్రేషనల్ స్పెక్ట్రా మరియు మాలిక్యులర్ ప్రాపర్టీలను ఉపయోగించి రసాయన సమ్మేళణాల విశ్లేషణ అనే అంశంపై ప్రయోగాలు చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడలోని పర్వతనేని బ్రహ్మణయ్య సిద్ధార్థ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టిఎన్‌వి.ఎస్ఎస్ సత్యదేవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమూహ సిద్దాంతం ఉపయోగించుకుని ఉసాయన సమూహాలను ఎలా గుర్తించాలి అనే అంశం విద్యార్థులకు వివరించారు. ఈ సదస్సులో వివిధ కళాశాలలకు చెందిన అనేక మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికేట్లు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యమ్ శివనాథ్, కళాశాల ప్రత్యేక అధికారి కె.సత్యనారాయణ, పీజీ రసాయన శాస్త్ర శాఖాధిపతి డాక్టర్ వి.ఎన్‌వి.కిషోర్, డిగ్రీ రసాయన శాస్త్ర శాఖాధిపతి డాక్టర్ జి.గిరిప్రసాద్ పాల్గొన్నారు.



ఎస్ఎస్ఎల్‌సి పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: 55 వసంతాల అనంతరం పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ సమ్మేళనానికి కొండపల్లి కానూరు వెంకట శివరావు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆదివారం వేదికైంది. 1968-69 ఎస్ఎస్ఎల్‌సి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం భావోద్వేగ వాతావరణంలో సాగింది. ముఖ్యఅతిథిగా విశ్రాంత ప్రధానోపాధ్యాయులు చిన్నం రామసుబ్బయ్య హాజరయ్యారు. ఈ సభను పాఠశాల పూర్వ విద్యార్థి, డాక్టర్ మోహన్‌రావు మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్ డాక్టర్ మామిడి శీతారామారావు అధ్యక్షతన నడిపారు. ఈ సందర్భంగా రామసుబ్బయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా విద్యార్థులతో అనుబంధాన్ని పంచుకోవడానికి కార్యక్రమానికి హాజరుకావడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాలలో విద్యార్థులతో గడిపిన ఆ రోజులను జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. 55 వసంతాల తరువాత తమతో పాటు విద్యనభ్యసించిన స్నేహితులను చూసి పూర్వ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం అప్పటి ప్రధానోపాధ్యాయులు చిన్నం రామసుబ్బయ్య, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు ఎంవీ శేషగిరిరావులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండూరి సత్యనారాయణ, శివరామకృష్ణ, మధు హరినారాయణ, గురవయ్య, కోయ బోసు, వేముల కొండ శివాజీ పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములుకు నివాళి

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ నగరపాలక సంస్థలో అమరజీవి పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి చంద్రశేఖర్, కార్పొరేషన్ సిబ్బంది ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ముందుగా పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు ఆత్మార్పణం చేసిన త్యాగశీలి అన్నారు. భాష ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటు, ప్రాంతీయ భాషలు, సాంస్కృతులను పరిరక్షించడంలో పొట్టి శ్రీరాములు కృషి మరువలేమన్నారు. స్థానిక పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు, సిబ్బంది పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సత్యనారాయణపురంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి వైసీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, స్థానిక కార్పొరేటర్ శర్వాణి మూర్తి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ డివిజన్ కోఆర్డినేటర్ దోనేపూడి శ్రీనివాస్, నాయకులు మైలవరపు రాము, చల్లా సుధాకర్, చల్లాప్రగఢ గోపాలకృష్ణ, కంభంపాటి ప్రసాద్, కూనపులి ఫణి, మురళీకృష్ణం రాజు, కొల్లూరు రామకృష్ణ పాల్గొన్నారు. **భవానీపురం:** స్థానిక విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి, ఆత్మార్పణ దినోత్సవం, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు గురించి విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తత్వం పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల తాత్కాలిక ప్రధానోపాధ్యాయులు కరుణాకరం జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు. **కంచికచర్ల:** కంచికచర్ల శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి అల్లూరు రామచంద్రుడు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించినారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి రిటైర్డ్ ఎఎస్ఐ దొడ్డపునేని రమేష్ పూలమాలవేసి నివాళులర్పించినారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ లైబ్రరీయన్ రంగిశెట్టి వెంకటేశ్వర్లు, గ్రంథాలయ పాఠకులు కార్ల్ మార్క్స్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు. **వీరులపాడు:** జుజ్జూరు మండల కేంద్రంలో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పబ్బతి రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి దూపుగుంట్ల శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులు పమిడిమర్రి జగన్మోహన్ రావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పబ్బతి రాజా, పబ్బతి విజయశ్రీ, కపలవాయి పద్మ, పమిడిమర్రి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం:** కొండపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్ నివాళుల అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పోతురాజు ఏసు దాస్, అక్కల ప్రసాద్, రాగాల రాము తదితరులు పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సంధర్భంగా 'ఆత్మార్పణ దినం'ను కొండపల్లి మార్కెట్ సెంటర్లో ఆదివారం నిర్వహించారు. మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. **జగ్గయ్యపేట:** పట్టణంలోని జమ్మిచెట్టు సెంటర్ వద్ద గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) స్థానిక నేతలతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణ వైసిపి అధ్యక్షులు వట్టెం మనోహర్ అధ్యక్షతన పట్టణంలోని సాయి బాబా గుడి దగ్గర ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చౌడవరపు జగదీష్, పెంటీ శ్రీనివాసరావు, బద్దు నాయక్, కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానం డైరెక్టర్ నంబూరు రవి పాల్గొన్నారు. **తిరువూరు:** స్థానిక వైసిపి కార్యాలయంలో శ్రీరాములు చిత్రపటానికి తిరువూరు నగర పంచాయతీ చైర్ పర్సన్ గత్తం కస్తూరి బాయ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, దత్తం నాగేశ్వరరావు, కాలసాని గోపాల నాగేశ్వరరావు, మోదుగు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **విజయవాడ:** సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రేడ్-2 శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి పి.సంపత్‌కుమార్ శ్రీరాములు వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు. ఠాగూర్ గ్రంథాలయంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి కే రమాదేవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కే రాంబాబు, స్కూల్స్ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విఎంసిలో...


ఠాగూర్ గ్రంథాలయంలో...



ఇబ్రహీంపట్నంలో...


జగ్గయ్యపేటలో...


కంచికచర్లలో...

ఎయిమ్స్‌లో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి- మంగళగిరి

మంగళగిరిలో ఎయిమ్స్‌లో రేడియో-డయాగ్నోసిస్ విభాగం, అనాటమీ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగిన 'ఇమేజ్ గైడెడ్ మస్క్యులోస్కెలెటల్ ఇంటర్వెన్షన్లపై కాడెరిక్' వర్క్ షాప్, శిక్షణ విజయవంతంగా ముగిసింది. దేశవ్యాప్తంగా 80 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన 10 మంది అధ్యాపకులు విచ్చేశారు. వీరు అత్యాధునిక ఎంఎస్‌కే జోక్యాలపై శిక్షణ ఇచ్చారు. ఇటువంటి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు చాలా అరుదు. రోగి ఫలితాలను మెరుగుపరచడానికి యువ రేడియాలజిస్టులను నైపుణ్యంతో సన్నద్ధం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మధబానంద కర్, డాక్టర్ శ్రీమంత్ కుమార్ దాస్, డీన్ అకడమిక్స్ డాక్టర్ వరప్రసాద్, జాతీయ అధ్యక్షుడు జైరాజ్ గోవిందరాజ్, జాయ్ ఘోషల్, డాక్టర్ పృథ్వీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జాతీయస్థాయి పోటీలకు పవర్ లిఫ్టర్లు ఎంపిక

ప్రజాశక్తి-మంగళగిరి

ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే ఫెడరేషన్ కప్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు రాష్ట్ర జట్టులో గుంటూరు జిల్లాకు చెందిన ముగ్గురు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయభాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సందానీ ఆదివారం తెలిపారు. మహిళా విభాగంలో షేక్ సాదియా ఆల్మాస్, షేక్ సబీనా, బి చంద్రిక ఎంపికైనట్లుగా పేర్కొన్నారు. ఈ పోటీలకు ఎంపికైన మహిళా పవర్ లిఫ్టర్లను ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు గంట వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సకల కోటేశ్వరరావు, ఆర్ఎన్ వంశీకృష్ణ, గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.



ఈతకెళ్లిన వ్యక్తి గుండెపోటుతో మృతి

ప్రజాశక్తి-తాడేపల్లి

కృష్ణా నదిలో ఈతకు దిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. విజయవాడకు చెందిన ఎం సీతారామిరెడ్డి (58) రోజు మాదిరి గానే అమరావతి కరకట్ట పక్కనే గల ఉండవల్లి ఫిషర్మెన్ కోపరేటివ్ సొసైటీ సమీపంలో కృష్ణా నదిలో ఈతకు దిగాడు. దిగిన కొద్దిసేపు ఈత కొడుతూ నదిలోకి వెళ్లిన నిమిషాల్లోనే గుండెపోటు వచ్చి మృతి చెందాడు. గజ ఈతగాళ్లు నదిలోకి దిగి ఒడ్డుకు చేర్చారు. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సంఘటనా స్థలానికి తాడేపల్లి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీతారామిరెడ్డి మృతి వార్త తెలిసిన ఆయన కుటుంబ సభ్యులు నది ఒడ్డుకు చేరుకొని మృతదేహం వద్ద విలపిస్తున్న తీరు అక్కడున్న వారిని కలసివేసింది.

మంత్రి లోకేష్ జోక్యం చేసుకోవాలి

12వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ సమస్యను మంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకొని పరిష్కరించాలని పోరాట కమిటీ నాయకులు కూరపాటి స్టీవెన్ కోరారు. న్యాయంగా తమకు రావలసిన బకాయిల కోసం సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 12 రోజుకు చేరుకున్నాయి. దీక్షలను తుపాకుల నాగేశ్వరరావు ప్రారంభించారు. దీక్షలో ఏనుగుల సాంబయ్య, వేము వెంకటేశ్వరరావు, దేవరపల్లి అంకయ్య, సిద్దిల బెంజిమెన్, ఎం ఆశీర్వాదం కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో వి వెంకటేశ్వరరావు, బి అంకయ్య, కె ఆదినారాయణ, ఎం గురవయ్య, ఏ నాగేశ్వరరావు, ఎన్ సుబ్బారావు, కె సీత, వై లక్ష్మి, డి రమణ, నవనీతం, టి దుర్గా భవాని పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు ఉద్యమ స్ఫూర్తి ఆదర్శనీయం


బందరులో పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, తదితరులు


మాట్లాడుతున్న కృష్ణాజిల్లా కలెక్టర్ డికె బాలాజీ


ఉయ్యూరులో...

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం తన జీవితాన్ని అర్పించిన మహనీయుడని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా నగరంలోని జిల్లా కోర్టు సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న ఆయన కాంస్య విగ్రహానికి మంత్రి, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, ఇతర కూటమి నాయకులతో కలసి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగు వారికంటూ ఒక ప్రత్యేక రాష్ట్రం కావాలని, ఆ ఆశయ సాధన కోసం మొట్టమొదటిగా నినదించి 1953వ సంవత్సరంలో ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించి, అమరజీవి యైన మహా పురుషుడు పొట్టి శ్రీరాములు కొనియాడారు. వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ మోటమర్రి బాబా ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, కూటమి నాయకులు బండి రామకష్ణ, కొనకళ్ల బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు ఉద్యమ స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. నగరంలోని కలెక్టరేట్ సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ ప్రభావంతో, పొట్టి శ్రీరాములు ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమంతో సహా ప్రధాన స్వాతంత్ర్య ఉద్యమాలలో పాల్గొని అనేకసార్లు జైలు శిక్ష అనుభవించారని, దేశం పట్ల ఆయనకున్న భక్తిని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి సి హెచ్ వీరాంజనేయ ప్రసాద్, ఉప విద్యా అధికారి శేఖర్ సింగ్, కలెక్టరేట్ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రజాశక్తిలి-ఉయ్యూరు** : స్థానిక ఏజీఅండ్ఎస్ ఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీరాములు చిత్రపటానికి గౌరవ అధ్యక్షుడు నూకల సాంబశివరావు, అధ్యక్షుడు సత్తార్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యదర్శి పూర్ణచంద్రంద్రరావు, ఆంజనే యులు, బాపిరాజు, హిమకరబాబు ఇతర సభ్యులు నివాళులర్పించారు. ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శివాలయం రోడ్డు రాము అపార్ట్మెంట్ ఆవరణలో శ్రీరాములు చిత్రపటానికి కె.సాంబశివరావు, రాము, తిరుమ లరావు, బుజ్జి, రాంబాబు, పూరకిషోర్, పూర నాగిన్, గోపాల్ తదితర సభ్యులు పూల మాలవేసి నివాళు లర్పించారు. ఎంపీడీ వో కార్యాలయం వద్ద శ్రీరాములు చిత్రపటానికి ఎంపీడీవో జీఎస్వి శేషగిరిరావు, ఉ ద్యోగులు, పూలమాలవేసి నివాళులర్పించారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : స్థానిక సెంటర్లోని వాసవి చౌక్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆదివారం పలు సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల ఆర్యవైశ్య , వ్యాపార వర్ధక సంఘం, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు కుంచపర్తి నాగ మురళి, కార్యదర్శి పూటుకూరు బాలసుబ్రమణ్యం, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కంతేటి సుబ్బారావు,లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ, వైసీపీ ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే గుడ్లవల్లేరు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద పొట్టి శ్రీరాములు చిత్రపటానికి గ్రామ స్పెషల్ ఆఫీసర్ విజయ సారథి, కార్యదర్శి ఏ జె ఎల్ నరసింహారావు, కార్యాలయ సిబ్బంది పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. **ప్రజాశక్తి-నాగాయలంక** : నాగాయలంకలో ఆర్యవైశ్య సంఘం, వాసవి సేవాదళ్ ఆధ్వర్యంలో ప్రధాన వీధుల వెంట పొట్టి శ్రీరాములు అమర్రహే అంటూ నినదిస్తూ ర్యాలీ నిర్వహించి ప్రధాన కూడలిలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల దండ వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ప్రముఖ డాక్టర్ బాసు ప్రతాప్, ఇరిగేషన్ ఏఈ పొన్నూరు రవితేజ లు పూలదండలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య ప్రముఖులు చిట్టా సాంబశివరావు, చిట్టా వీరన్న పూర్ణయ్య, తాడికొండ సత్యనారాయణ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం** : బాపులపాడు మండలం బండారుగూడెం గ్రామ సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సచివాలయం మహిళ కానిస్టేబుల్ ఝాన్సీ, బర్రె లెనిన్‌లు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. **ప్రజాశక్తి-మోపిదేవి** : మోపిదేవిలో గల ఆర్యవైశ్య కళ్యాణ మండపం ఎదుట గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి జనసేన పార్టీ నాయకులు కోసూరు రామాంజనేయులు పూలమాలలతో నివాళులు అర్పించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు గద్దె రఘు రామారావు, గ్రామస్తులు ఆంజనేయులు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు** : జనసేన పార్టీ ఆధ్వర్యంలో స్థానిక కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలోని పొట్టిశ్రీరాములు విగ్రహనికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త ముప్పారాజా,గ్రామ పార్టీ అధ్యక్షులు బోయిన నాగరాజు, మండల కార్యదర్శి సుంకర శివ, మేకల నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు** : తోట్లవల్లూరు లోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు, జాతిపిత మాహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తోట్లవల్లూరు మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు భవిరిశెట్టి రంగారావు, కార్యదర్శి పోకూరి కాశీవిశ్వేశ్వరరావు, కోశాధికారి నంబూరి తాండవ కష్ణ కుమార్ దేసు శ్రీనివాసరావు, వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ నంబూరి శివన్నారాయణ, వాసవీక్లబ్ కోశాధికారి తమ్మన వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడివాడ** : స్థానిక అమరజీవి పొట్టి శ్రీరాములు చౌక్‌లో అర్యవైశ్య సంఘం, శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానం, అర్యవైశ్య ప్రముఖులు కొత్త మురళీకృష్ణ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ముఖ్య అతిథిలుగా మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావులతో కలసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైశ్య సంఘ అధ్యక్షుడు జవ్వాజీ గంగరాజు, టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి, చేకురు జగన్మోహన్రావు, యక్కలి మణిదీప్, పట్టణ వైశ్య సంఘాల పెద్దలు పోకూరి మోహనరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ** : పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, యువ నాయకులు మండలి వెంకట్రాం పూలదండలు వేసి నివాళులర్పించారు. టిడిపి అవనిగడ్డ మోపిదేవి మండలాల అధ్యక్షులు యా సం చిట్టిబాబు, నడకుదుటి జనార్ధన్ రావు, టిడిపి నియోజకవర్గ వాణిజ్య విభాగం నాయకులు ఘంటసాల రాజమోహన్రావు, కూటమి నాయకులు సిద్ధినేని అశోక్ నాయుడు, పూత బోయిన సీతారత్న పాల్గొన్నారు.అలాగే శ్రీరాములు చిత్రపటానికి జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు పూలదండలు వేసి నివాళులర్పించారు.రామచంద్రపురం ఉపసర్పంచ్ ఆంజనేయులు, వైసిపి ఆర్యవైశ్య సంఘం నాయకులు గార్లపాటి గోపి, అద్దేపల్లి ప్రసాద్, తోట సుధీర్ పాల్గొన్నారు.

• పలుచోట్ల ఘన నివాళులు



గుడ్లవల్లేరు మండలంలో...


గుడివాడ మండలంలో...

రెండో రోజుకు పైడమ్మ మహోత్సవాలు

ప్రజాశక్తి-పెడన : పట్టణ గ్రామ దేవత అయిన పైడమ్మ అమ్మవారి జాతర మహెూత్సవాలు రెండో రోజైన ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. వేకువ జాము నుంచే అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో పాటు వేడి నైవేద్యాలు సమర్పించారు. 11 సిరిబండ్లతో అమ్మవారిని ఊరేగింపుగా ఆలయానికి తరలించారు. మేళ తాళాలు డప్పు వైద్యాల నడుమ కేరళ సంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారు ఆలయానికి చేరుకున్నారు. ఈ వేడుకను చూసేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. ఈ ఊరికింపులో నిర్వహించిన సంస్కృతి కార్యక్రమాలకు పిల్లలతోపాటు పెద్దలు ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఆలయ ఈవో తిక్కిశెట్టి వీర వెంకట మోహన్ రావు ఆలయ మర్యాదలు చేశారు. జనసేన పట్టణ సీనియర్ నాయకులు కూనపురెడ్డి రంగయ్య నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు చందన నారాయణరావు లతోపాటు పలువురు కుల పెద్దలు పాల్గొన్నారు. అలాగే గూడూరు మండలంలోని కప్పలదొడ్డి గ్రామానికి చెందిన గుత్తి సోమయ్య కూడా అమ్మవారికి సిడిబండ్లు నిర్వహించారు. అనంతరం 2000 మందిపైగా అన్నదానం చేశారు.


దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-గుడివాడ : క్రిస్మస్ కాలం పవిత్ర మైందని ఈకాలంలో గాయక బృందానికి మెండా కిరణ్‌కుమార్ వితరణతో దస్తులు పంపిణి చేయాడం అభినందనీయమని అవిలాపూరి చిన్న తేరేజమ్మ దేవాలయం (ఆర్‌సిఎం) విచారణ గురువు ఎం.లూయిస్‌రాజు అన్నారు. ఆదివారం స్థానిక గుడ్‌మెన్‌పేటలోని ఆర్‌సిఎం గుడివాడ-2 చర్చిలో మాలమహానాడు రాష్ట్ర నాయకులు మెండా కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో కొయిర్ బృదానికి, వృద్ధులకు చీరలు, దుస్తులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి నాయకులు కంచర్ల సుధాకార్, కౌన్సిల్ సభ్యులు తోట బేనర్జీ, బేజం సువర్ణరాజు, డెక్క భూషణ్ పాల్గొన్నారు.

'చలో గుంటూరు'కు తరలిన మాలమహానాడు నాయకులు

ప్రజాశక్తి-గుడివాడ : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా గుంటూరులో ఆదివారం జరిగిన అఖిల భారత్ మాల సంఘల జెఏసి అధ్వర్యంలో భారీ బహిరంగ సభకు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పొంగులేటి జయరాజు అధ్వర్యంలో భారీగా వాహనలలో తరలివెళ్లారు. ఆదివారం స్థానిక రాజేంద్రనగర్‌లోని అంబేద్కర్ భవనం నుండి జయరాజు అధ్వర్యంలో సుమార్ 20 కార్లు ఛలో గుంటూరు బహిరంగ సభకు వెళ్ళే వాహానాలకు జయరాజు జెండాను ఊపి ప్రాంరభించారు.



మూడో రోజుకు డోకిపర్రు బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి, గుడ్లవల్లేరు : మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలో ఉన్న శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆదివారం గజవాహనంపై విహరించారు. డోకిపర్రు మహాక్షేత్రం నవమ సాలకట్ల బ్రహ్మోత్సవాలు ఆదివారం మూడో రోజుకు చేరుకున్నాయి. మూడో రోజున ఉదయాన్నే సుప్రభాత, తోమాల సేవ, అర్చన కైంకర్యాల అనంతరం శ్రీ వెంకటేశ్వర స్వామి శ్రీదేవి, భూదేవి సహితంగా గజ వాహనంపై డోకిపర్రు గ్రామంలో విహరించారు. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వరుని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం రథోత్సవం జరిగింది. మూడో రోజు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పీ వీ కష్ణారెడ్డి, సుధారెడ్డి పర్యవేక్షణలో జరిగిన పూజాదికాల్లో నిర్వాహకులు పీ వీరారెడ్డి, విజయలక్ష్మి, కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయభాస్కరమ్మ, పీ నాగిరెడ్డి, పీ ప్రసన్న, పీ వీ సుబ్బారెడ్డి, సుమలత, పీ రాజేష్ రెడ్డి, హరిణి, పీ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రం శ్రీ వేంకటేశ్వరుని రథోత్సవం, గరుడోత్సవం జరిగాయి.

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ



ప్రజాశక్తి-అవనిగడ్డ : పేద విద్యార్థులకు సాయం అందించడం ద్వారా వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాది అవుతుందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ప్రశంసించారు. ఆదివారం సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అవనిగడ్డలోని ఏ1 మార్ట్ సమావేశ మందిరంలో బొండాడ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ బొండాడ రాఘవేంద్రరావు ఆర్థిక సహాయంతో విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ చేశారు. రాయల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ శీతాళం రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సభకు బుద్ధ ప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి 62 మంది విద్యార్థులకు రూ 4 లక్షల 60 వేల రూపాయల విరాళాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ విద్యలో అత్యంత ప్రతిభ కనబరుస్తూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి వారికి చేయూతనివ్వడం మంచి షో పరిణామం అన్నారు. ఎంఈఓ టీవీఎస్ రామదాసు, రాయల్ సర్వీస్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి తోట పద్మనాభరావు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ తోట శ్రీరంగ సత్య బాలాజీ, ట్రస్ట్ ట్రెజరర్ అంకం రామసాయి ప్రసాద్ పాల్గొన్నారు.




వికలాంగులకు క్రిస్మస్ కిట్లు అందజేత

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కేతనకొండ గ్రామంలోని గ్రేస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో గ్రామంలోని 33 మంది వికలాంగులకు క్రిస్టమస్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ పాస్టర్ మొగులూరి ఎలీషా మాట్లాడుతూ రాబోయే క్రిస్టమస్ పర్వదినం సందర్భంగా గ్రామంలోని వికలాంగులకు కొంత సహాయము చేశామన్నారు. వికలాంగులను చిన్నచూపు చూడవద్దని దేవుని దృష్టిలో అందరూ సమానమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేస్ మినిస్ట్రీస్ సెక్రటరీ సుమలత, అబ్రహం, నాగరాజు, జోజి, సిద్దు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి : దారెల్లి

ప్రజాశక్తి-వత్సవాయి: రైతు సమస్యలపై తన వంతు కృషి చేస్తానని నీటి సంఘం సభ్యులు దారెల్లి నాగేశ్వరరావు (మదార్) అన్నారు. మండలంలోని పాలంపల్లి డబ్బాలపల్లి



గ్రామ పరిధిలో నీటి సంఘం సభ్యునిగా ఆయన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సమస్యలపై నిరంతరం పని చేస్తానని, రైతులకు సాగునీరు అందించడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, టిడిపి సీనియర్ నాయకులు నెట్టెం రఘురాం, గ్రామ నాయకులు కిలారి చిన్ని విశ్వనాథ ప్రసాద్, సూర్యనారాయణ, ఆవుల రామారావు, సామినేని నాగేశ్వరరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన నీటి సంఘాల ఎన్నికలు

ప్రజాశక్తి-వత్సవాయి: మండలంలో సాగునీటి సంఘాలు ఎన్నికలు ముగిశాయి. రామచంద్రపురం బీసీ నెంబర్ 2 కి మాత్రమే ఎన్నిక జరగగా మిగతా సంఘాలన్నీ ఏకగ్రీవం అయ్యాయి. ఎన్నికలు శనివారం సాయంత్రం వరకు జరిగినట్లు ఎన్నికల అధికారి, తాసిల్దార్ ఎస్ నరసింహారావు తెలిపారు. మంగోళ్లు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా మన్నె నారాయణరావు, అలసిగాని నవీన్‌కుమార్ (చిన్న మోదుగుపల్లి), షేక్ మహబూబ్ హుస్సేన్ (భీమవరం), పెంట్యాల వెంకటేశ్వర్లు (డబ్బాకుపల్లి), కొలగాని రామయ్య (చిట్యాల), చిట్టూరి సుభాష్ (వేములనర్వ), కంచేటి లక్ష్మీనారాయణ (లింగాల), గోలేటి వెంకటేశ్వర్లు (రామచంద్రపురం), చిరుమామిళ్ల పరమయ (కన్నెవేడు), ఉప్పుగండ్ల వెంకటేశ్వర్లు (వత్సవాయి), సేవా శాంతిబాబు (ఖమ్మంపాడు), కుంభంపాటి రమేష్ (పెంట్లవారిగూడెం) సాగునీటి సంఘం అధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

కృష్ణయ్యను కలిసిన జుజ్జూరు నేతలు

ప్రజాశక్తి-వీరులపాడు: జుజ్జూరు గ్రామ అభివృద్ధికి, మండల



నూతన భవనాలు కోసం నిధులు కేటాయించాలని హైదరాబాదులో రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్యను బీసీ సంఘం నాయకుల కలిసి విజ్ఞప్తి చేశారు. రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైనందుకు ఆర్.కృష్ణయ్యను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ శ్రీనివాసరావు, రామవత్తు రాంబాబు, సోమయాజులు, మేడికొండూరు నందకుమార్, పూల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'శ్రీమతి అమరావతి' పోటీలు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: వీటీపీయస్ గ్రౌండ్స్‌లో శనివారం రాత్రి జరిగిన శ్రీమతి అమరావతి సంప్రదాయ ఫ్యాషన్ షో 9వ సీజన్ గ్రాండ్ ఫైనల్స్ అత్యంత ఘనంగా సాగాయి. ఈ కార్యక్రమంలో నటీమణులు సురభి, దివి వడ్త్యా, అర్చన, కామ్నా జెఠ్మలాని పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ బాబు మోహన్, ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ అంబికా కృష్ణ మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాల్లో దూసుకెళుతున్నారని అన్నారు. ఇటువంటి పోటీల నిర్వహణ వల్ల మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకత, సమర్థత వెలికితీయడం ఎంతో తేలికన్నారు. ఈ కార్యక్రమాన్ని తేజాస్ ఎలైట్ నిర్వహించగా నిర్వాహకులైన మేనేజింగ్ డైరెక్టర్ తేజశ్వీ తాతినేని, సీఈవో టి.ప్రదీప్ చౌదరి పాల్గొని మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా దిగ్విజయంగా శ్రీమతి అమరావతి పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. 9వ సీజన్‌లో 50మంది పాల్గొనగా 30 మంది రన్నర్స్‌గా నిలిచారని వారిలో శ్రీమతి అమరావతిగా దాసరి శ్రీ ప్రియ ఎన్నికయ్యారని పేర్కొన్నారు. ఎంతో మంది మహిళలు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. రన్నర్లుగా ప్రదీపిక శాంతి నిలిచారు. వివిధ విభాగాలలో ఉత్తమ సోషలిస్ట్‌గా స్నేహ, ఉత్తమ ట్రెడిషనల్‌గా విజయలక్ష్మి, ఉత్తమ బ్యూటీగా దివ్య, ఉత్తమ హెయిర్ సిరి సాయి, ఉత్తమ



స్మైల్ శ్యామల, ఉత్తమ నడక సుస్మిత, ఉత్తమ ఐఎస్ట్‌గా పూజిత చౌదరి ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు.

మాదిగదాసుల అభివృద్ధికి చర్యలు తీసుకోండి

ఎస్‌సి కమిషన్ ఛైర్మన్‌కు వినతి

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఎస్‌సి సామాజిక వర్గంలో ఉపకులంగా ఉన్న మాదిగ దాసుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కిషోర్ మక్వానాకి మాదిగదాసు జాతీయ సంక్షేమ సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదివారం విజయవాడ వచ్చిన మక్వానాని స్థానిక గవర్నర్‌పేటలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగజ్జీవన్‌రామ్ ఐక్యతా భవన్‌లో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాదిగదాసు జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మంగళగిరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మాదిగదాసు కుల ధ్రువీకరణ పత్రాన్ని తహసీల్దార్ స్థాయిలోనే జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందటం లేదని, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రావాల్సి రాయితీలు లభించడం లేదన్నారు. ఆలయ కమిటీ నియామకాల్లో సభ్యులుగా తమ సామాజిక వర్గం



వారికి అవకాశం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా కిషోర్ మక్వానాని దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు తాళ్లూరి విష్ణువు, సహాయ కార్యదర్శి టి. హనుమంతరావు, సభ్యులు ఎం.రమణ, టి. అంకినీడుప్రసాద్, టి.ప్రవీణ్, ఎం.పవన్‌కుమార్ దాసు, బి.వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రీవెన్స్

ప్రజాశక్తి-విజయవాడ

కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాలు, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయంలో కూడా నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. పటమటలోని సర్కిల్ 3 కార్యాలయంలో కమిషనర్ ప్రజా ఫిర్యాదులను స్వీకరిస్తారని పేర్కొన్నారు. నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దగ్గరలోని కార్యాలయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 10 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందన్నారు. జోనల్ కార్యాలయాలతో పాటు ప్రధాన కార్యాలయంలో కూడా అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

17న రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని ధరణి కోట రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో ఆదివారం విశ్రాంతి ఉద్యోగుల సంఘం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎంప్లాయిస్ ప్రెసిడెంట్ దారా వినోద్ బాబు మాట్లాడుతూ ఈ నెల 17న ఉదయం పది గంటలకు రిటైర్డ్ ఎంప్లాయిస్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశం జగ్గయ్యపేట కోదాడ రోడ్డులోని ఎన్ఎస్పి వర్క్‌షాప్‌లో జరుగుతుందని, శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్, మాజీ ఎమ్మెల్యే ఉదయభాను, మాజీ మంత్రి రఘురాం, మున్సిపల్ ఛైర్మన్ రాఘవేంద్ర అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ చింతల తిరుపతయ్య సభ్యులు పాల్గొన్నారు.

విస్పర్ నూతన ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: విస్పర్, స్త్రీ పరిశుభ్రత బ్రాండ్, విస్పర్ అల్ట్రా అప్‌టు నో గ్యాప్ నో లీక్స్‌తో పీరియడ్ ప్రొటెక్షన్‌ని పునర్నిర్వచించటానికి తయారు చేయబడిందని, దేని గురించి అవగాహన కల్పిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి గిరీష్ కళ్యాణ్ రామ్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. నూతన టెక్నాలజీని కలిగి ఉందని, ఇది స్త్రీ శరీరం ఆకృతులకు సహజంగా సరిపోయేలా రూపొందించబడిందని అన్నారు. ఎటువంటి ఖాళీలు, లీక్‌లు లేకుండా, రోజంతా మృదువైన, సౌకర్యవంతమైన అనుభూతిని అందిస్తుందన్నారు. విస్పర్ అల్ట్రా అత్యుత్తమ రక్షణతో పాటు, మృదుత్వం, సౌకర్యాన్ని అందిస్తుందన్నారు.

ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ


గిరి ప్రదక్షిణ

ప్రజాశక్తి-వన్‌టౌన్: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం వైభవోపేతంగా గిరి ప్రదక్షిణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా ఘాట్ రోడ్డు ఎంట్రెన్స్ వద్ద గల శ్రీ కామదేను అమ్మవారి దేవస్థానం నుండి ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ కార్యక్రమం ఆలయ వైదిక సిబ్బంది వారి ఆధ్వర్యంలో ఆలయ ఈవో కె.ఎస్. రామారావు పూజదికాలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ రకాల కళాకతులు, నాట్యాలు, మంగళవాయిద్యాల, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ గిరి ప్రదక్షిణ కార్యక్రమం వైభవోపేతంగా సాగింది. ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని, అమ్మవారిని స్వామివారిని దర్శించుకొన్నారు. గిరి ప్రదక్షిణ అనంతరం కళాకారులు (వివిధ ప్రాంతాలకు చెందిన వంద మంది పైగా కళాకారులు) అమ్మవారి సన్నిధిలో మహామండపం ఏడవ అంతస్తు నందు నత్య ప్రదర్శన గావించారు. అనంతరం గిరి ప్రదక్షిణలో పాల్గొన్న చిన్నారి కళాకారులను ఈవో కేఎస్ రామారావు ప్రోత్సహించి, అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ప్రసాదం అందజేసి అభినందించారు.

దుర్గమ్మను దర్శించుకున్న జయప్రద, శ్యామలదేవి

దుర్గమ్మను ఆదివారం మాజీ రాజ్యసభ సభ్యులు, సీనియర్ సినీనటి జయప్రద, మాజీ కేంద్ర మంత్రి, సీనియర్ సినీనటుడు కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి, ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో కె.ఎస్.రామారావు వారికి స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.


జయప్రద, శ్యామలాదేవిలకు చిత్రపటం అందజేస్తున్న ఇఒ